"చెప్పండి... నేను అడుగుతున్న దానికి సమాధానం చెప్పండి..."

ఆమెకు అర్థంకాక కాదు మౌనంగా ఉంది. అర్థమయ్యీ కొన్నింటిని ఒప్పుకోకపోవడంతో ఒక అస్పష్టతలో నించి జనించే ఒక మంచుగడ్డలాంటి అస్థిరత.

దూరంగా సముద్ర ఘోష... ఆలోచనలు బలంగా మెదడును ఒత్తుతున్నాయి.

గడ్డం కింద చేయి పెట్టుకుని ఆలోచిస్తోంది ఆమె... స్పందన. పాలరాతి బల్లమీద ఉన్న పోర్సిలిన్ ప్లేట్లవంక చాలా మామూలుగా చూసింది. సముద్రానికి మీదుగా ఆ నిశ్శబ్ద వాతావరణంలో తెలియని ఒక అలికిడిని సృష్టిస్తూ వెళ్లిపోయింది విమానం.

"మీరు మాట్లాడలేరు... నాకు తెలుసు. ఎందుకంటే... మంచితనం ముసుగుకింద మీరు నిద్ర పోతున్నారు. అవునా? కాదా తినరు... ఎందుకంటే... ఆమె... ఆమె మీ ఫ్రెండు కాబట్టి... అవునా!"

చాలా పొడుగ్గా ఉన్నాడనిపించే ఆ అందమైన మనిషి కట్‌గ్లాసులోని ఎఱ్ఱటి ద్రవం నోట్లో పోసుకుంటూ ఛఱ్ఱునవెళ్లి పాలరాతి స్థంభాల్లోంచి సముద్రాన్ని చూస్తూ నిలబడ్డాడు.

అతని బుజాల కదలిక, అతడి దవడనరం బిగుసుకుపోవడం... అతని ఎమోషన్ ఎంత స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడో అర్థమౌతోంది ఆమెకు... ఏ మనిషీ నోరు తెరచి ఇది నేను అని చెప్పక్కర్లేదు. అతనిచూపులో, నడకలో, నిట్టూర్పులో భృకుటిముడుపుతో, నిశ్శబ్దంతో చాలా చెప్పగలడు. ఎదుటివాళ్ళకు చాలా సులభంగా అర్థమైపోతాడు, చూసేవారికి చూపుంటే.

ఆమె స్పందన... మేధావంతురాలైన ఆమెకు అర్థంకాక కాదు. అతనూ తెలుసు... అతను జవాబు చెప్పండి... అని నిలదీస్తున్న... అతని భార్య... రమ్య గురించీ తెలుసు. కొంతమంది జీవితంలో మామూలు ప్రపంచంలో ఉండవలసినవి అన్నీ ఉన్నా అసంతృప్తి ఫీలౌతారు. కారణం లేనివి కోరుకోవడం అంటారు సామాన్యులు... కానీ, మానసికమైన అసంతృప్తి. దానికి కారణాలు చాలా అస్పష్టమైనవి.

అదుగో అటువంటి అసంతృప్తి రమ్యలో ఉన్నది. కానీ... స్పందన సముద్రపు ఒడ్డున ఉన్న ఆ గెస్ట్‌హౌస్‌కు వచ్చింది. కాలానికీ తర్కానికీ ఒదిలేస్తే తప్ప జవాబు దొరకని ప్రశ్నలకు అర్థం వెతకడానికి కాదు.

ఆమె అక్కడికి హాస్పిటల్ నుంచి నేరుగా వచ్చింది. రమ్య స్లీపింగ్ టాబ్లెట్స్ మింగింది.

ఎప్పుడూ, ఏనాడూ భార్యని మాట అనని అతను పెద్ద రగడ చేసి సముద్రపు ఒడ్డున ఉన్న ఆ గెస్ట్‌హౌస్‌కి వచ్చి ఉండిపోయాడు.

సౌందర్య ప్రపంచంలో నిర్జీవనత ఉంటుందేమో... కటకటాల గేటు వెనకాల పొంగిపొరలుతూ గర్జిస్తూ హృదయఘోష. మేధావంతుడి బలమైన ఆలోచనలా, నేను ఉన్నాను. నన్ను గుర్తించమంటోంది సముద్రం... భగవంతుడి ప్రతిబింబం సముద్రం అంటాడు బైరన్.

"ఒడ్డు తాకి ముద్దు పెట్టుకుంటున్న ఒక్కొక్క అలకూ ఒడ్డు కోసుకుపోతోంది... కరుడుగట్టిన నిశ్శబ్దాన్ని చీల్చుకుని వస్తున్నా అలల నోరు సముద్రపుగాలికి కదిలిపడిపోతాయో అన్నట్లున్న కొబ్బరిచెట్లు, ఒడ్డున ఉండే చల్లదనాన్ని ఎండ కోసేస్తోంది. గాలి హోరుకు రంగు రంగుల పూవులు... స్వప్నదేవతాలంకారాల్లా... గాలికి ఊగుతున్నాయి. నిశ్శబ్దంగా ఏదో చెపుతున్నట్లు, ప్రశ్నిస్తున్నట్లు... "ప్రభూ! ప్రకృతికి దూరమైపోయిన ఈ జనారణ్య పరిపాలకులకు అలంకారాలమేనా మేము" అని ప్రశ్నిస్తున్నట్లు... కొండరాతితో మనిషి చేతితో మలచిన కొలనులో తామరలు కూడా రాతితో చేసి



రంగువేశారా? అన్న భ్రమ కలిగిస్తున్నాయి. సముద్రపు ఒడ్డున కొబ్బరిచెట్లు నిశ్చేతనంగా దీపం ముందు దీవిటీల్లా వెలవెలపోతున్నాయి.

మనిషి సౌందర్యాన్ని కూడా భ్రమా? అన్నట్లు సృష్టించగలడు... తలుచుకుంటే ఎంత గొప్పవాడవగలడు మనిషి... ఒక్కసారి గాలి తెర... 'ఓహ్... అనుకుంటూ బాబ్డ్‌హెయిర్ సరిచేసుకుంటూ ఈ ప్రపంచంలోకి వచ్చింది స్పందన.




చుట్టూ చూసింది. అన్నీ అందమైన వస్తువులూ ఒక్క చోట కలబోసినట్లు... పాలరాతిగదుల్తో, గొప్ప పెయింటింగ్స్‌తో, ఉయ్యాలలాంటి మంచాలతో, ఆడియో, వీడియో కేసెట్స్ కేబిన్‌తో, బిల్డిన్‌బార్‌తో... ఇదొక చిన్న ప్రపంచమా అన్నట్లుంది ఆ గెస్ట్‌హౌస్... బయటి ప్రపంచాన్ని తన వ్యక్తిత్వంతో గజగజవణికించే ఈ వ్యక్తి చాలా పసిబిడ్డలా కనిపించాడు ఆమెకు.

సీరియస్‌గా చూస్తూ, మెల్లిగా విషయం చెప్పినప్పుడు అతని తేనెరంగు కళ్లల్లో ఏదో భయం... పసిమి ఛాయ పదునుతేరి బుగ్గలు ఎఱ్ఱబడ్డాయి.

తేరుకున్నాడు కాసేపట్లో... ఒక రెండు పెగ్గుల తరవాత. నర్సింగ్ హోమ్‌కు ఫోన్ చేసి స్పెషల్ కేర్ తీసుకోమని ఆజ్ఞలు జారీచేసి తన సెక్రటరీకి ఫోన్ చేసి బాధ్యతలు చెప్పాడు.

అన్నీ నిర్లిప్తంగా చూస్తోంది స్పందన.

టెలిఫోన్ తీగెను పట్టుకుని తనతోపాటు తిప్పుకుంటూ, ఆ ఇన్‌స్ట్రుమెంటును చాలా పొసెసివ్‌గా చంకనపెట్టుకుని, చారల పట్టు లుంగీతో నిలబడి మాట్లాడుతున్న అతను ఏ సమయానికి ఎంత మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలిసిన వ్యక్తి.

మెల్లిగా అద్దాల కేసుల్లోకి చూస్తోంది ఆమె: లివ్ 52 నుంచి అన్ని రకాల మందులూ ఉన్నాయి. అదంతా రమ్యమైన వాతావరణం. రమ్యేలేదక్కడ.

'ఉష్' అంటూ వెనక్కు తిరిగింది.

అతను ఫోను మాట్లాడ్డం మానేసి చాలాసేపైందేమో, తననే చేతులు కట్టుకుని పరీక్షగా చూస్తున్నాడు.

"ఇంక నేను బయలుదేరతాను..." బేగ్ తీసుకుని బయలుదేరబోయింది.

"మేడం... మీతో కాస్సేపు మాట్లాడాలి. ఉంటారా...?" మాట్లాడలేదామె. అతని గొంతులో పదునుకు ఆమెకు చాలా అర్థమయ్యాయి. మెల్లిగా బాగ్ టేబిల్ మీద జారవిడిచింది.

"ఎందుకు తను నన్నిలా అల్లరిపాలు చేసింది?" సముద్రంలో హోరు... అయినా ఆ ప్రశ్న చాలా స్పష్టంగా వినిపించిందామెకు.

సినిమా ఇన్డస్ట్రీలో సుప్రసిద్ధుడైన ఆ డిస్ట్రిబ్యూటర్ అడుగుతున్న ప్రశ్నలో లోతు ఆమెకూ అర్థంకాకపోలేదు.

కానీ, ప్రశ్నంత పొట్టిగా సమాధానం ఉండదు. పైగా, కొన్ని ప్రశ్నలకు జవాబులు మాటలతో ఉండవు.

"చెప్పండి మీరూ రమ్యా ఇరవై ఏళ్లుగా స్నేహితులు. చెప్పండి... నేనేంతక్కువ చేశానని?!"

నిజమే... రమ్యా, స్పందనా కాలేజీ నుంచీ క్లాస్‌మేట్స్. అసలు పెళ్లే చేసుకోని, స్పందన, చాలా రిచ్‌గా బతుకుతున్న గృహిణి అయినా రమ్య స్నేహం చాలా విలక్షణమైంది.

కారణం వాళ్లిద్దరిదీ చాలా విరుద్ధమైన స్వభావం, ఆలోచనలూ, ఆశయాలూ అన్నీ వేరు.

నిండుగా చీర కట్టుకునే రమ్యకు, బాగీపాంట్స్ వేసుకుని చకచకమని తిరిగే స్పందనకు రూపంలో, చూపుల్లో జీవితాల్లో కూడా చాలా వ్యత్యాసముంది.

కానీ స్నేహానికి తెలియని ఏదో వైబ్రేషన్ ఉంటుంది. అదేదో వాళ్ళను కలిపి ఉంచింది. అంతే.

"దాని మొహం... అదీ దాని బాగీ పాంట్స్ మరీ ఆడతనం లేకుండా..." అప్పుడప్పుడు విసుక్కునేది రమ్య మొహమాటం లేకుండా.

"నిండా చీరకట్టుకుని ఎదటివారికి ప్రతి ఒంపులోనూ నేను ఆడదాన్నని చెప్పే వాళ్లకన్నా ఆవిడ నయం. ఆవిడ ప్రొఫెషన్ అది. అక్కడ ఎబిలిటీ అవసరం కానీ, అందర్నీ కవ్వించగలగడం కాదు." అన్నాడు మూర్తి ఒకరోజు. ఉలిక్కిపడింది రమ్య ఆరోజే.

కారణం—చాలా ఉంది. రమ్య చాలా అందగత్తే... విలక్షణమైన మనిషి. కానీ దురదృష్టం. ఆమెకు సౌందర్యానికి ఊహ లెక్కువ. తనను ప్రతి క్షణం ప్రతి ఒక్కరూ గుర్తించాలని, ఆరాధించాలనీ, ప్రేమించాలనీ తపనపడే వ్యక్తిత్వం ఉన్న అమ్మాయి. అది ఈనాటిది కాదు. ప్రెసిడెన్సీ కాలేజీలో తన ప్రత్యేకత గుర్తింపబడేదాకా నిద్రపోయేది కాదామె. ఆమెలోని స్త్రీత్వానికి మెప్పుదల

కావాలి. ఆదివ్వడానికి ప్రపంచంలో కొద్దిమంది ఆమె మీద ఆధారపడ్డవాళ్లు, ఆమె మెప్పుకోరేవాళ్లూ, ఆమెతో అవసరమున్న వాళ్లూ... వీళ్లకు తప్పని సరి... కానీ వీటికి అతీతమైన ప్రపంచం ఉంది. అక్కడ ఆమె హర్ట్ అయ్యేది.

కారణం ప్రపంచానికి ఈమె పట్ల సానుభూతి లేకకాదు. ప్రపంచంలో మరే సాటివ్యక్తి పట్లా ఈవిడకు 'సహింపు' లేకపోవడం. అదేమిటో తెలియదు ఆమెకు.

"నిన్ను సైకియాట్రిస్ట్ దగ్గరకు లాక్కెళ్లాలనలు..." కేకలేసింది స్పందన ఆ రోజు.

"నేనేం పిచ్చిదాన్నా? అలా మాట్లాడతావు..." ఎత్తున ఎగిరిపడింది రమ్య.

"మరి ఇందాక ఆకుపచ్చ బార్డర్‌కు మెజంతా బార్డరు చీర కావాలని ఇంటినించి బయలుదేరావు. షాపు వాడిచేత ఐదువందల చీరలు తీయించావు. తీరా నీకు కావలసిన చీర దొరకలేదనీ, ఇంత దరిద్రపు గొట్టు కాంబినేషను ఎక్కడాలేదు ఇల్లాంటి చీరలు ఉంటే మీ షాపు ఎత్తెయ్యొచ్చు అని అతణ్ణి విసుక్కుంటావేమిటి? నువ్వు పదివేల బిల్లు నెలకొకసారి ఇస్తావని ఆబ్లిగేషన్‌తో ఆగాడు అతను. లేకపోతేనా?" కేకలేసింది స్పందన.

కానీ, అస్పష్టంగా రమ్య అసంతృప్తికి కారణం తెలుస్తూనే ఉంది. అంతకుముందే వాళ్ల ముందునుంచి చాలా అందమైన అమ్మాయి ఆ కాంబినేషన్ చీర కట్టుకెళ్లింది.

"అక్కా నువ్వు కావాలన్న కాంబినేషన్ అదేకదూ... ఆ అమ్మాయి చాలా బావుంది అక్కా..." అన్నాడు వెంట వచ్చిన రమ్య తమ్ముడు గోపీ.

ఓరకంటితో చూసింది. వెంటనే చేతిలో చీర జారిపోయింది. ఆ తరువాత అనవసరమైన రగడ చేసింది.

అస్పష్టంగానైనా అర్థమైంది స్పందనకు. రమ్య దేనితో బాధపడుతోందో... స్పెషాలిటీ కోసం తపన. దానికి ఏది అడ్డం వచ్చినా భరించలేదు.

ఇల్లాంటి చిన్న విషయాల దగ్గరనుంచీ గమనించే స్పందనకు విషయం తెలియక కాదు... కానీ... చెప్పే విషయంకాదు.

స్వార్థాన్ని మరీ అసహ్యకరమైన కోణం నుంచి చూడకపోతే, అదేమంత పెద్ద నేరంకాదు స్పందన దృష్టిలో.

కానీ, రమ్యలో ఈ మధ్యకాలం వరకూ స్వార్థాన్ని పట్టించుకోలేదు. కానీ ఆమెది ఓర్వలేనితనం. అది పరిధులు దాటి తనను తాను బాధపెట్టుకుని, ఎదటివారికి నరకం సృష్టిస్తుంది.

ఎవరో ఫ్రెండ్‌తో వస్తూ కొత్త మారుతీ ఏక్సిడెంట్ చేసింది. దాన్ని మూర్తి అంత పట్టించుకోకపోను... అవతలి వ్యక్తి బాయ్ ఫ్రెండ్ కాకపోయినా, పోలీసులు దానికివ్వాల్సినంత నగిషీ ఇవ్వకపోయినా...

అప్పుడే మొట్టమొదటిసారి ఆలోచన వచ్చింది. తను రమ్య గురించి తెలిసిన ఆఖరివాడినేమోనని.

కోటీశ్వరుల గారాబు బిడ్డ, విశృంఖలత, సౌందర్యం, సన్నటి నాజూకుతనం వెనకాల దాచగల రమ్య దర్పానికి బంగారు పట్టీలు పెడుతుంది: ఆరొందల తక్కువ చీర కట్టదు. తనతో తక్కువ స్థితిలో ఉన్నవాళ్లతో అసలు మాట కలపదు. ఆడతనానికి సాధారణంగా అంటగట్టే స్టుపిడిటీ అతడు భరించేవాడే... కానీ ఇవన్నీ ఆమె ప్రత్యేకతలని ఆమె ఫీలౌతోందని తెలిసినప్పుడు కష్టపడి పైకి వచ్చిన అతనికి ఒక రకమైన వెగటు కలిగింది.

ఇవన్నీ చెపుతున్నాడు స్పందనతో. తను ఎలా ఫీల్ అవుతోంది. అసలు ఆమె తన మూర్ఖత్వంతో అందరికీ ఎలా దూరమౌతోంది? ఎలా మాటపడిపోతోంది.

అంతా డ్రమాటిక్‌గా... మధ్య మధ్యలో మాట మారుస్తూ, జస్టిఫైస్‌తో... చాలా బాధపడుతూ చెపుతున్నాడు.

అతను ఇన్ని మాటలతోనూ చెప్పలేనిదొకటే... అతని మాటల వెనకాల కసి ఉందనీ అతను అనుకున్నంత బాధపడటంలేదనీ...

స్పందన చెప్పలేనిదొకటే... "నువ్వు ఆమె మీద కసికొద్దీ, ఆమె అహం మీద దెబ్బకొట్టడానికి ఆమెకాలిగోటికి కూడా పోల్చలేని తన కింద ఉద్యోగినితో సంబంధం పెట్టుకున్నావని. దానికి కావలసినంత పబ్లిసిటీ ఇస్తున్నావనీ..."

అందుకే అతను చెపుతున్నట్టూ, ఆమె వింటున్నట్టు ఉన్నా... వారి ఆలోచనా రేఖలు చాలా సమానాంతరంగా ఒకే వేగంతో వాతావరణంలోకి చొచ్చుకుపోతున్నాయి.

"ఎందుకిలా చేసింది రమ్య?... చెప్పండి..." నిజంగా సమాధానం అడిగినట్టు బాధపడుతూంటే విసుగొచ్చింది స్పందనకు.

"రమ్య చాలా ఫూలిష్... ఒప్పుకుంటాను. కానీ మీరు చాలా సినికల్‌గా ఉన్నారు. బై. వస్తాను. రేపు మార్నింగ్ ఫ్లైట్‌కు పనిమీద ఊరువెళ్తోన్నాను. మీ వైఫ్ జాగ్రత్త అని నేను చెప్పక్ఖర్లేదు. వస్తా..."

సుడిగాలిలా టక టక హీల్స్ చప్పుడు చేసుకుంటూ వెళ్లిపోయిన ఆవిడను చూసి సన్నగా నవ్వుకున్నాడు మూర్తిలో మొగవాడు.

"పళ్లరసం తప్ప తాగడం లేదమ్మా! పిల్ల తెగబాధపడిపోతోంది..." రవ్వల దుద్దులు, ఉంగరాలు, బంగారు గాజులు ఇవన్నీ ప్రదర్శన యోగ్యంలా ఉన్నాయా లేవా అని చూసుకుంటూ హాస్పటల్ వాతావరణంలో కూడా తన జరీచీర అంచు హోదా తగ్గకుండా కూతుర్ని కనిపెట్టుకోవడం అన్న వంకతో విడియోలు చూస్తూ స్నాక్స్ నవులుతూ వచ్చేపోయ్యే వాళ్లమీద కామెంట్స్ విసురుతూ ఫైవ్‌స్టార్ హోటల్‌లాంటి ఆ హాస్పటల్ రూంలో హాయిగా గడిపేస్తోంది, రమ్య తల్లి మీనాక్షమ్మ.

ఆవిడను చూస్తేనే చిర్రెత్తుకొచ్చేది స్పందనకు. మొదటినుంచీ అంతా ఆర్టిఫీషియాలిటియే. ఇట్లాంటి వాళ్లందరినీ చచ్చినట్టు కట్టుకున్న పాపానికి లంచాలైనా పట్టి సంపాదించి, ఈ నిరుపయోగమైన ఆడవారి సూడో ప్రిస్టేజికి సర్వం అమర్చడానికి బైట పులుల్లా బ్రతికి ఇంట్లో పిల్లులైపోయే మొగవారి లిస్టులో వాడు రమ్య తండ్రి. ఈవిడ మాటలు విని తల్లినీ, కుంటి తమ్ముడినీ కూడా ఇంట్లోనించి పంపించి వేసిన మహానుభావుడు.

వీళ్లను చూసినప్పుడల్లా,

"టు హెల్ విత్ ది మేరేజ్..." ఏ లక్షోసారో అనుకుంటుంది స్పందన.

అయినా మర్యాదకని... 'ఎందుకనే?'' అంది రమ్యను... అసలు రమ్యలో సహం పిచ్చి భ్రాంతులకు ఆ తల్లే కారణమని స్పందనకు మహా కోపం.

"అది కాదే... ఈ మధ్య రెండు కేజీలు పెరిగాను. హాస్పటల్ పుణ్యమా అని తగ్గుదామని..." జాకెట్టు లూజ్ అయిందా అని చూసుకుంటూ అంటున్న రమ్యను చూడగానే ఓపిక నశించింది స్పందనకు.

"చూడు తల్లీ! నేను వెళ్లాలి... మీ ఆయనతో మాట్లాడాను. చాలా బాధపడుతున్నాడు..." ఈ మాటలు అనేసిన తరవాత ఎందుకు చెప్పింది తనా మాట అని స్పందనకే అర్థం కాలేదు.

అవి తను అనాలనుకున్న మాటలు కావసలు. కానీ కొన్ని సందర్భాలకు కొన్ని మాటల్ని మెదడు ఫ్రేం చేసి పెట్టుకుని రిఫ్లెక్స్ యాక్షన్‌లా ఆయా సన్నివేశాల్లో అనిపిస్తుందేమో.

లేకపోతే ప్రపంచం అంతా ఆలోచించేది చెప్పడం ప్రారంభిస్తే మారణహోమం అయిపోదూ?!

"ఆయనేం బాధపడక్ఖర్లేదు... ఎవడు ఏడవమనాడు?" అతడిని నిందితుణ్ణి చేస్తూ నిష్ఠూరంగా మాట్లాడుతోంది రమ్య. తిడుతూ కూడా అందంగా ఉన్నానా అన్నట్టు అద్దంలోకి చూసుకుంటూ కనురెప్పల మీద సుతారంగా వేలితో మీటుకుంటూ... అటు ఇటూ చూసుకుంటూ...

మండిపోయింది స్పందనకు.

"వస్తాను—మీ ఇద్దరూ కలిసి ప్రపంచాన్ని ఫూల్సును చేద్దామని ప్రయత్నిస్తున్నారు. అంతే... ఎలాగూ కలిసి బ్రతక్క తప్పదని ఇద్దరికీ తెలుసు. ఎందుకీ మెలో డ్రామాలు. అయినా గంజిలో ఉప్పులేదని కొంతమంది ఏడుస్తూంటే, పాయసంలో ఏలకులు ఎక్కువయ్యాయని మీరేడుస్తున్నారు. స్టాప్ ఆల్ దిస్ నాన్సెన్స్...కొంచెం నిన్ను గురించి నువ్వు ఆలోచించడం తగ్గించుకో. నీ బాధ ప్రపంచానికి బాధ అనుకోవడం మానుకో. అనవసరంగా గోల చెయ్యకు. నేనొచ్చేటప్పటికి మామూలుగా ఉండాలి. సరేనా..." వద్దన్నా ఆమె మాటల్లో సన్నిహిత్యం వినిపిస్తుంది. అందుకే మరెవరూ ధైర్యం చేసి అనలేని మాటలు స్పందన రమ్యను అనగలదు.

కారణం స్పందన ఏ విధంగానూ రమ్య జీవితానికి పోటీరాదు. సాటి రాదు.

మరొక కారణం. స్పందన ప్రేమలో నిజాయితీ ఉంది. బాధ్యతలు మోసే పౌరుషం ఉంది. అవసరం వస్తే అడ్డం నిలబడే శక్తి ఉంది. ఆ మొగరాయుడితనం అదీ తెచ్చి పెట్టుకున్నదని అందరికీ తెలుసు.

"వస్తాను. మీ ఆయన దగ్గర నుంచి ఫోను వస్తే నోరు మూసుకుని ఆక్సెప్ట్ చెసెయ్యి. అనవసరంగా అల్లరి అవకు..."

"నీకేం చెప్తావు?! ఆత్మాభిమానం తాకట్టు పెట్టుకుని బ్రతకడం..." అరి చేతుల్లో మొహం దాచుకుంటూ అంది రమ్య.

అప్పుడు చూసింది స్పందన. టేబిల్ మీద బుక్ పంపిన వాళ్ల పేరు చూసింది.

జయంత్... కారు ఏక్సిడెంట్‌లో ఇన్‌వాల్వ్ అయిన అబ్బాయి.

చిర్రెత్తింది స్పందనకు.

"డామిట్... అసలు పెళ్లే ఆత్మాభిమానం తాకట్టు పెట్టుకోవడంతోనే ప్రారంభమౌతుంది... మళ్లీ అచాప్టర్ ఎందుకు వస్తా..." వెళ్లిపోయింది స్పందన.

"ఉప్పెన గాలి... ఎప్పుడే పెళ్లి పెటాకులూ చేసు

కుంటుంది? వాళ్లనాన్న దాన్ని గాలికి వదిలేశాడు. ఇల్లూ, ఆస్థీ అవీ ఉన్నాయటగా..." అప్పటికే పక్క వార్డు వాళ్లతో కబుర్లు చెప్పి వస్తూ అంది మీనాక్షమ్మ.

"సర్లే..." అటు తిరిగి పడుకుంది రమ్య...

* * *

ఓడియన్‌లో టికెట్స్ బుక్ చేసి ఎవరో చుట్టాలొస్తే దింపి కారు రివర్సు తీసుకుంటోంది స్పందన.

అప్పుడు చూసింది మూర్తిని.

పక్కన ఆ అమ్మాయి కాబోలు.

నవ్వొచ్చింది. ఇద్దరూ మారలేదు... మారరు. మధ్యలో వాళ్లందరికీ టెన్షన్.

ఈ ఆత్మహత్య డ్రామావల్ల హాస్పిటల్ వాళ్లకి వేలలో బిల్లులూ, తేలిగ్గా ఉంటాయని రమ్య తీసుకున్న అరడజను షిఫాను చీరలు, రమ్య తేరుకుని మామూలు మనిషైంది కాబట్టి గెట్ టు గెదర్ పార్టీలు... ఇవన్నీ గమనిస్తూనే ఉంది స్పందన. మూర్తి గురించి రూమర్లు పట్టించుకోవడం మానేసేటంత పబ్లిక్ చేశాడతడు.

చూడనట్లు వెళ్లి పోదామనుకున్న ఆమెకు కారు హారన్ వినబడింది. తప్పనిసరై తిరిగి చూసింది.

"నాతో రండి..." సౌంజ్ఞ చేసి ముందుకు డ్రైవ్ చేశాడతను మరొక మాట లేకుండా.

ఆలోచిస్తూనే ఫాలో అయింది స్పందన.

రాయపేటలో పాత పెంకుటిల్లు ముందు కారు ఆగింది. గత ప్రాభవాలున్న పాత కాలపు ఇల్లు.

లోపల కటకటాలు, దగ్గుతున్న ముసలావిడ, నిద్రగన్నేరు చెట్టుకింద తోమవలసిన సత్తు గిన్నెలు.

సంపూర్ణమైన లోయర్ మిడిల్ క్లాస్ వాతావరణం సినిమా వాళ్లు సెట్ వేసినట్లు కుదిరింది.

అతడు, అతడి తరవాత ఆమె కారు దిగారు.

"లోపలికి రండి" అతను చనువుగా అన్నాడు.

"ఈయన ఇల్లుకు ఆహ్వానం ఒకటి..." పెదవి విరుస్తూ లోపలికి వెళ్లింది.

ఆ వాతావరణంలో తమాషాగా ఒదిగిపోయాడతను. మరీ అవుటాఫ్ ప్లేస్‌గా బాధపడుతున్నది తనొక్కర్తే.

కాఫీ తాగింది. సెకండు డికాక్షన్ కాఫీ... నోరెత్తలేదు స్పందన. అమృతం తాగినట్లు తాగుతున్నాడతను.

వరండాలో తను, మూర్తి... ఆ అమ్మాయి లోపలికి వెళ్లింది.

నిశ్శబ్దం... మెల్లిగా మాటలు, చాలా జాగ్రత్తగా ఏరినట్లు పేరుస్తూ చెప్పుకొచ్చాడతను.

ఆ అమ్మాయి ఆ ముసలావిడ కూతురు. కేన్సర్ రావడం వలన భర్త వదిలిపెట్టాడు. ఉన్న ఒక్క చిన్న పిల్లాడిని మూర్తే హాస్టల్‌లో పెట్టి చదివిస్తున్నాడు... ఆ ముసలావిడ ఇవ్వాళో రేపోగా ఉంది. ఆ అమ్మాయి ఆరునెలల కన్న బతకదు. ఆ విషయం ఆ అమ్మాయికి తెలుసోలేదో కానీ ఉద్యోగం ఇచ్చి తనే వ్యాపకం కలిపిస్తున్నాడు.

నవ్వొచ్చింది స్పందనకు. అవన్నీ వింటూంటే... ఏమంటాడు అయితే?! కేన్సర్ ఉన్న అమ్మాయితో రొమాన్స్ ఉన్నట్లు ఎందుకు ప్రపంచానికి చిత్రీకరించాడు. తన జాలి గుండె వగైరాలకు పబ్లిసిటీనా?!

అంత చీప్ వ్యక్తి కాదే అతను... ఆలోచిస్తూ అనుకున్నది.

"వంట రెడీ అయింది..." ఆ అమ్మాయి చెప్పింది వచ్చి. పరీక్షగా చూసింది స్పందన. కేన్సర్ అనగానే ఆమె దృష్టి ఆ అమ్మాయి పట్ల మారిపోయింది.

అతడు ఆమెను భోజనానికి రండి అనలేదు. అయినా వాతావరణంలో ఏదో ఆహ్వానం.

కింద కూచుని తడిపొడి నేలమీద, పొట్లకాయ కూర, పులుసు, నీళ్ల మజ్జిగా... స్టీలు కంచాల్లో... అతని వంక చూసింది స్పందన.

అతని భోజనం, ఇంట్లో డైనింగ్ టేబిల్ మీద పారఫర్నేలియా అంతా గుర్తుకు వచ్చింది. ఏం కావాలి అసలు ఇతనికి?! అతను తలచుకుంటే డబ్బుతో ఈ ఇంటి వాతావరణాన్నే మార్చెయ్యగలడు. మరి?!

[లోకజ్ఞానం - సమాధానాలు]

1. క్రీ. పూ. 1000 సంవత్సర ప్రాంతాలలో
2. 10,486 చదరపు కిలోమీటర్లు
3. బెంగాలీ, హిందీ, నికోబారీస్, తమిళం, మలయాళం
4. పనాజీ
5. 40,248
6. 174 (83 బంగారు పతకాలు; 61 వెండి, 30 కాంస్య పతకాలు)
7. 39,842 కిలోమీటర్లు
8. డాకర్
9. షేక్ ముజిబుర్ రహమాన్
10. క్రీ. పూ. 1500 లో ఈజిప్టు, మెసపటోమియా దేశాలలో.

"వస్తానమ్మా..." ఆ ముసలామెకు కాబోలు చెప్పి వచ్చాడు.

"నన్నెందుకు నా పనులు చెడగొట్టి తీసుకువచ్చావు మహానుభావా?" అని అడుగుదామని ఉంది స్పందనకు.

"మరొక చిన్న విషయం చెప్పాలి..." ఆమె డ్రైవింగ్ సీటు విండోమీదకు ఒంగి అన్నాడు.

"ఆ ముసలావిడ నా పినతల్లి... ఆ అమ్మాయి నా చెల్లెలు. అర్థమైందా?"

సిగరెట్టు చాలా మామూలుగా నోట్లో పెట్టుకుంటూ సన్నగా అన్నాడు.

"ఆ!" నోరు తెరిచింది స్పందన.

"డామిట్. మరి ఇంత పబ్లిసిటీ... రమ్యకు అంత షాక్... ఇవన్నీ ఎందుకు చేస్తున్నారు..." తపీమని అతణ్ణి తోసేసినట్లు కారు తలుపుతీసి బైటకు వచ్చింది.

"సింపుల్... ఆ అమ్మాయి ఎవరో తెలిసిన వ్యక్తి ప్రస్తుతం మీరే... ఆరు నెలలలో చనిపోతుందనీ తెలిసింది నాకొక్కడికే. మా పినతల్లి పల్లెటూరు మనిషి. నన్ను చాలా ప్రేమగా పెంచింది. ఆవిడకు బ్రహ్మచెముడు. ప్రపంచం అనే మాటలు వినబడవు... ఇంక ఆ అమ్మాయి వీటన్నింటికీ అతీతురాలైపోయిందేమో..."

"మరి రమ్య!..."

"రమ్యకు అలా చూడటం తప్ప ఇంకోలా చూడటం రాదు. అంతే... నా మీద రూమరు విని స్లీపింగ్ టాబ్లెట్సు మింగి ఆర్భాటం చేసింది కానీ, ఆ అమ్మాయి ఎవరో తెలుసుకుందామని కనీసం ప్రయత్నించలేదు. ఉన్నది ఉన్నట్లు చూడ్డం చేతనైతే..." ఆపాడతను.

అసలు నిజమే మిధ్య అయితే ఇంకా దాని ప్రతిబింబాన్ని చూస్తూ జీవితం అల్లుకుంటాడు మనిషి...

"రమ్యకు చెప్పుంటే ఇంత రగడ జరిగేది కాదుగా..."

"చెప్పను... బాధ పెట్టడమేకానీ, బాధపడటం, అహం అడ్డుపడితే తట్టుకోవడం నేర్చుకోవాలి మీ ఫ్రెండు. అఫ్‌కోర్సు... నేనే రిజిడ్‌మోరల్స్ గురించి మాట్లాడను. కానీ, నేనెప్పుడూ ఫాల్స్‌ప్రిస్టేజ్ కోసం దిగజారనని నా నమ్మకం...

"కోటీశ్వరుడి కూతుర్ని చేసుకుంటూ అనాడు నా స్థాయి పెంచుకోవాలనుకున్నాను. కానీ, ఆమెతోపాటు ఆమె అహాన్ని అలవాట్లనూ, ఆమెతరపు మనుష్యుల ఊదరను భరించాలని తెలియలేదు నాకు... కానీ నేను పెరిగిన జీవితం పెద్ద ఖరీదైంది కాకపోవచ్చు కానీ వాల్యూస్ తెలుసు... రమ్యను మార్చాలి. మానసికంగా ఎదగనివ్వాలి... అందుకే ఈ శిక్ష... ఒదిలేస్తే ఏముంది?! బాగుచేసుకోవాలి కానీ... ఇది నా దారి... కుళ్లి ఏడవనీయండి... మనను మెత్తబడుతుంది."

మౌనంగా చేతులు కట్టుకుని అతనివంకే చూస్తోంది స్పందన. తలకాయ వంచుకుని తన చేతివంక చూస్తూ మాట్లాడుతున్న అతడిని చూడగానే మొట్టమొదటిసారిగా ఏదో తెలియని గౌరవం కలిగింది స్పందనకు.

తప్పకుండా ఇతను అందర్లో ఒకడు కాదు... మనకేంతెలువని మనుష్యుల్తో మాట్లాడతాం... ఎక్కడినించో మన ఊహా, రూపకల్పన, ఎదటివ్యక్తికి అంటగట్టి అతను కాని అతనితో మనం మాట్లాడి, మన నిర్ణయాలకు మనం వస్తాము.

అందుకే 'వుయ్ టాక్ విత్ ఇమేజస్" అంటారు జిడ్డు కృష్ణమూర్తి... ఎంత నిజం అది.

"నేను రమ్యకు ఈ విషయం..." పన్నుతో పెదవి బిగబట్టి సన్నగా నవ్వుతూ అన్నది.

"చెప్పద్దు... చెప్పరని కూడా నాకు తెలుసు. రమ్య దృష్టిలో చాలా తక్కువైన వ్యక్తి ఈ అమ్మాయి. ఎలా నన్ను ఆకర్షించిందా అని బుర్ర బద్దలుకొట్టుకుంటోంది. పిచ్చివేషాలు మానేసింది... ప్రేమ మనని ప్రేమించేవాళ్ళకూ, మనని మనం ప్రేమించుకోడానికీ పరిమితంకాదని అర్థం చేసుకుంటోంది. మీరు గమనించే ఉంటారు. మీరు హితంకోరే స్నేహితులని తెలుసు. ఆవిడ క్షేమం కోరేవారైతే ఈ మానసికవ్యాధి అదుపులోకి వస్తుండగా అడ్డుపడరనీ నాకు తెలుసు..."

సూటిగా చూస్తూ అన్నాడు.

"సూపర్బ్..." చిన్నగా చప్పట్లు కొడుతూ అన్నది స్పందన.

"బంగారపు గాజులు వేస్తే చేతులు పొడుగ్గై, మట్టిగాజులు వేస్తే పొట్టవవు..." ఈ నత్యం తెలిసిన వ్యక్తి ఇతను...

మొట్టమొదటిసారిగా రమ్య అదృష్టాన్ని ఆమె గుర్తించలేని అదృష్టాన్ని అర్థం చేసుకుంది స్పందన.

"ఓ.కే... ఈ రోజునించీ మనిద్దరం స్నేహితులం..." నవ్వుతూ అన్నది స్పందన.

"థ్యాంక్యూ... స్నేహం అంటే కేవలం తోడుకాదండీ... మంచి స్నేహితులు మనిషిని మంచివైపుకు నడిచేట్లు చూడాలి... అర్థంచేసుకోండి ప్లీజ్..."

గౌరవంగా ఒంగి ఆమెకు కారు తలుపు తీసేడతను.

కారు స్టార్ట్ చేస్తూ కళ్లెత్తి నవ్వుతూ చూసింది స్పందన. ఆమెకెందుకో హాయిగా ఉంది... ఎప్పుడైనా మామూలు "మంద"కు భిన్నమైన వ్యక్తి కనబడితే, జనారణ్యంలో తప్పిపోకుండా నిజానికి దగ్గరగాఉన్న వ్యక్తి కనబడితే కలిగే ఆనందమది.

"మేడం చిన్న విషయం చెప్పనా...?" బాబ్డ్ హెయిర్ వెనక్కుతోసుకుంటూ ఏమిటన్నట్లు చూసింది.

"మీరెంత నటించినా... మీరు చాలా అందమైనవారు"

"యూ..." చటుక్కున కారు స్టార్ట్ చేసి, రివర్స్ చేసి నవ్వుతూ చెయ్యి ఊపింది స్పందన.

మొదటిసారిగా ఆమెకు మొగవాడి విజయానికి అర్థం తెలిసినట్లైంది.

* * *

పదిహేను రోజులు తరవాత.

"నీకిదొక జబ్బు... కార్లో కూర్చుని ఎక్కడికో పోనీయమంటావు? గమ్యంలేని ప్రయాణం మనిషికిచ్చే థ్రిల్ ఇంకేం ఇవ్వదేమో..." విసుగ్గా అంది స్పందన.

"నీకు తెలుసుటగా... ఆ ఇంటికి పోనీయ్."

"ఏ ఇల్లు..." అనుమానంగా అంది.

"రాయపేట హాస్పిటల్ దగ్గర..." అస్సలు తలెత్తకుండా అమాయకంగా అంది రమ్య.

సడన్ బ్రేక్ వేసింది స్పందన.

"అంటే?"

"ఏం? మీరంతా సర్వజ్ఞులా... నాకూ అంతా తెలుసు. కానీ లేటుగా.... ఆవిడ మా చిన్నత్తగారు. ఆ అమ్మాయి మావారి కజిన్."

"ఎలా తెలుసు?" వెనకాల హారన్‌కు ట్రాఫిక్ తప్పించుకుంటూ అంది స్పందన.

"మా అమ్మ చెప్పింది... ఆవిడ చూసిందట ఆ అమ్మాయినీ, ముసలావిడను..."

రమ్యవాళ్ల అమ్మ?!

ఆవిడకు అంత ఉదారతా?!

ఆమాటే మరొకరకంగా అడిగింది.

"నాకు చాలామంది గురించి అర్థమైంది స్పందనా! చాలా నేర్చుకుంటున్నాను. హాస్పిటల్ బెడ్‌మీద ఉన్న కూతురుచేత, కొడుకు బిజినెస్సుకు సంతకాలు పెట్టించుకుంది మా అమ్మ... ఏమిటమ్మా అంటే, ఒకవేళ నువ్వు పోయావంటే... ఇదంతా అనవసరంగా పరాయివాడికిపోదూ అంది చాలా మామూలుగా. ఏం మనుష్యులు?! అసలు ఎవరు సొంతం? ఎవరు పరాయి?"

"నా తల్లి ఇప్పటికి అర్థమౌతోందీ ప్రపంచం. అంటే నీకు... అది సరే వాళ్ల సంగతి... నువ్వు వేరే ఊహించుకుని బాధపడుతున్నావని మీ అమ్మ చెప్పారా?"

"నీ మొహం... వాళ్లకు అంత ఉదారత కూడా. నా సొమ్మంతా దోచిపెడుతున్నాడు, ఆఫీసులో ఉద్యోగం కూడా ఇచ్చారట అని నాకు మరింత కచ్చ రేపడానికి చెప్పారు అంతే. తరవాత నేను కనుక్కుంటే నాకు తెలిసింది ఎంత పొరపాటు చేశానో"

"మీ ఆయన్ను అడిగావా?"

"ఆఁ! నీకు కూడా తెలుసన్నారు. అయినా నువ్వన్నా చెప్పవచ్చు కదా..." నిష్ఠూరంగా అంది.

"చెప్పొద్దన్నాడు ఆ చెప్పిన మహానుభావుడు" అందామనుకుంది. కానీ, ఈ పెళ్లి అనే మెస్మరిజంలో ఏదో మత్తు ఉంది. అందులో ఈ రమ్యలో ఏదో మార్పు వస్తోంది. ఇప్పుడు నేను కల్పించుకోకుండా ఉండడం ఉత్తమం... అనుకున్నది.

"అయితే ఇప్పుడేం చేద్దామని..."

"వాళ్లను మా ఇంటికి తెచ్చుకుంటాను. నా వద్దేనిమిది గదులు ఇంట్లో వాళ్లకు చోటుండదా?"

"మరి మీ అమ్మావాళ్లూ?!"

"ఉంటే ఉంటారు. లేకపోతే వాళ్లకు బోలెడన్ని ఇళ్లు. కానీ పాపం వీళ్లకెవరూ లేరే..."

చాలా మార్పు వచ్చింద రమ్యలో. మూర్తిలో ఏదో మెస్మరిజం ఉంది.

ఇదంతా మంచితనంతో, తెలివితేటలతో సాధించిందేనా?!

"నీ ఇంటి డోర్‌మేట్ నువ్వు ముందు దులుపుకో శుభ్రం చేసుకో... ఆ తరవాత బైటవారి పాదాల్ని శుభ్రం చెయ్యడానికి దాన్నే ఉపయోగించవచ్చు..." ఎక్కడో చదివిన కొటేషను.

"వసంత తన ఫర్మ్‌లో ఉద్యోగం కోసమే తన వెంటపడ్డదని అనుమానం... అసలు, తను మూర్తి మీద కచ్చకొద్దీ డైవర్ట్ అయ్యాననడం... ఇప్పుడు తనచుట్టూ మనుష్యులంతా మారారనడం..." ఇలా మాట్లాడేస్తోంది రమ్య.

'వాళ్లంతా మారడం కాదు తల్లీ నీ చూపుల్లో తేడా వచ్చింది. నీ బుద్ధికి చూపు వచ్చింది. నువ్వు ఎదిగావు.' ఇవన్నీ అనలేదు స్పందన. ఇంకా రమ్య అపక్వఘటమే... ఇప్పుడే వివేకం విడమరిచి చెపితే అహం మీద దెబ్బతగలచ్చు.

"ఏమిటే ఆలోచిస్తున్నావు..." రమ్య మాటలు ఆపి అన్నది.

"అహా... మొన్నీ మధ్య మూర్తి నన్నొక ప్రశ్న వేశాడు.

'ఆవిడ మా పినతల్లి కాకపోయినా, ఆ పిల్ల నా చెల్లెలు వరస కాకపోయినా, మీరు ఇంత మానవత్వంతోనూ ఆలోచించగలరా?... అలా ఆలోచిస్తే ఎదుగుదల ఏమిటో అర్థమౌతుంది' అన్నాడు. దాన్ని గురించి ఆలోచిస్తున్నాను... సరే... దిగు ఇల్లు వచ్చింది.'

కారు తలుపు తీస్తూ అన్నది స్పందన. □



## డా॥ఫాతిమా కుట్టీకపిల్

"ఆత్మవిశ్వాసం, పట్టుదల వుంటే స్త్రీలు కూడా ప్రతీ రంగంలోనూ ప్రగతి సాధించడానికి అవకాశం వుంటుంది." అంటారు డాక్టర్ (శ్రీమతి) ఫాతిమా కుట్టీకపిల్. మద్రాసులో జన్మించిన డాక్టర్ ఫాతిమా, లేడీ ముత్తయ్యా చెట్టియార్ బాలికల పాఠశాలలో విద్యాభ్యాసం గావించారు.

కేవలం చదువే కాకుండా, క్రీడలన్నా, నాట్యమన్నా సంగీతమన్నా చాలా మక్కువ చూపించి ఆసక్తిగా పాల్గొనేవారు. ముత్తయ్యా చెట్టియార్ కళాశాల విద్యార్థినిగా ఉన్నప్పుడు భారత ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో ఉత్తీర్ణురాలై కళాశాలకు ఘనత తెచ్చారు. తరువాత ఎతిరాజ్ కాలేజీలో బి.ఏ. పట్టభద్రురాలయ్యారు. కాలేజీ విద్యార్థినిగా వుంటూ, అనేక బహుమతులను పొంది, కాలేజీకి ఘనత తెచ్చారు. పిదప ఆంధ్రయూనివర్శిటీలో చరిత్ర శాఖలో ఎమ్.ఏ. (1974) పట్టా తీసుకొన్నారు.

ఎమ్.ఏ. విద్యార్థినిగా వున్నప్పుడే చరిత్రశాఖలో పరిశోధన చేయాలని పట్టుదల వుండేది. ఆ పట్టుదలతోటే 'విశాఖలో బ్రిటిష పాలన 1794-1898" అన్న అంశంపై పరిశోధన జరిపి డాక్టరేటు తీసుకొన్నారు.

1976 జూన్‌లో ఆమెకు బరోడా బ్యాంక్ మేనేజరు శ్రీ జి.వరప్రసాద్ గారితో జరిగిన వివాహంతో ఆమె జీవితం ఒక చక్కని మలుపు తిరిగింది. "నా ఆత్మ విశ్వాసానికి, పట్టుదలకు, ప్రోత్సాహం యిచ్చే భర్త దొరకడం నిజంగా నా అదృష్టం" అంటారు డాక్టర్ ఫాతిమా. ఉద్యోగ రీత్యా ఆమె భర్త మహబూబ్‌నగర్ జిల్లాకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. "నా భర్త సహకారం వల్లనే నేను నా పరిశోధనను ఏ ఆటంకం లేకుండా జరపగలిగాను" అంటున్న డాక్టర్ ఫాతిమా ప్రస్తుతం ఆంధ్రా యూనివర్శిటీలో చరిత్ర శాఖలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. పి.హెచ్.డి. స్కాలర్లుకు రిసెర్చి డైరక్టర్‌గా వున్నారు. 'ఉన్నత విద్యాకోర్సులలో తెలుగులో బోధన అమలుకు వస్తే మీరేం చేస్తారు?' అని ప్రశ్నించినప్పుడు "నాకు తెలుగు అంటే చాలా ఇష్టం, తెలుగు మాట్లాడడం బాగా అలవాటు చేసుకున్నాను. అందువల్ల తెలుగులో బోధించగలనని నాకు నమ్మకముంది." అన్నారు డాక్టర్ ఫాతిమా.

ఆమె అనేక సమావేశాలలో పరిశోధనా వ్యాసాలను సమర్పించారు. మీ పరిశోధన యింకా సాగిస్తారా అని అడిగినప్పుడు "ప్రస్తుతం పోస్ట్ డాక్టరల్ రిసెర్చి కొనసాగిస్తున్నాను." అన్నారు. ఇంతే కాకుండా ఈమె ఆంధ్రప్రదేశ్ చారిత్రక కాంగ్రెస్, విశాఖ చారిత్రక సంఘాలలో సభ్యురాలు. ఇటీవల ఆంధ్రాయూనివర్శిటీ చారిత్రశాఖ పరిశోధన పర్యవేక్షుల వర్గంలో సభ్యురాలుగా నియమించబడ్డారు.

—ఎమ్.సత్తిరెడ్డి